
ఇస్రోలో శిక్షణకు వైపాలెం విద్యార్థి ఎంపిక


ఇస్రోకు ఎంపికైన శశాంక్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) నిర్వహించిన పరీక్షల్లో స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆముదం శశాంక్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆ విద్యార్థికి శాలువకప్పి అభినందించారు. మేనెల 15 నుంచి 30వ తేదీ వరకు శ్రీహరికోటలో జరిగే శిక్షణలో శశాంక్‌రెడ్డి పాల్గొంటారని కృష్ణవేణి స్కూల్ అకాడమీ డైరెక్టర్ కృష్ణ తెలిపారు.

కరోనా.. కంగారొద్దు



పూర్తి అప్రమత్తంగా ప్రభుత్వం

- గ్రామస్థాయిలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పరీక్షలు, మందులు
- ఆస్పత్రుల్లో అందుబాటులో 12 వేల సాధారణ, 34 వేల ఆక్సిజన్ పడకలు
- పుష్కలంగా మందుల నిల్వలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. కేంద్ర వైద్యశాఖ ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అయితే తొలి నుంచి కరోనా వైరస్ నియంత్రణ పట్ల పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. ఒకవేళ మన వద్ద కేసుల నమోదు పెరిగినా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామస్థాయిలోనే అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలతో పాటు, పాజిటివ్ రోగులకు వైద్యసేవలను అందుబాటులో ఉంచుతోంది.

విలేజ్ క్లినిక్స్‌లో ర్యాపిడ్ కిట్‌లు

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను చేరువ చేయడానికి 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో కరోనా పరీక్షతో పాటు 14 రకాల రోగ నిర్ధారణకు ర్యాపిడ్ కిట్‌లతో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి విలేజ్ క్లినిక్‌లో కనీసం 10 కరోనా పరీక్షల ర్యాపిడ్ కిట్‌లను వైద్యశాఖ నిరంతరం అందుబాటులో ఉంచుతోంది. ర్యాపిడ్ టెస్టుల్లో పాజిటివ్‌గా తేలినవారి నమూనాలను ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లకు పంపి పరీక్షించనున్నారు. రాష్ట్రంలో 13 ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కేసులు అధికం

కొత్త వేరియంట్ కేసుల నమోదుపైనా వైద్యశాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. పాజిటివ్ రోగుల నమూనాలను విజయవాడలోని జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపి పరీక్షిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు తేలింది. గత నెల ఒకటో తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ మధ్య పాజిటివ్ రోగుల 167 నమూనాలను సీక్వెన్సింగ్ చేశారు. వీటిలో అత్యధికంగా 84 కేసులు ఎక్స్‌బీబీ.1.16 రకం ఉన్నాయి. ఎక్స్‌బీబీ.1 రకం కేసులు 13, ఎక్స్‌బీబీ.2.3. వేరియంట్ కేసులు 17, మిగిలినవి ఇతర వేరియంట్‌లుగా తేలింది.

ఎనీటైమ్ అందుబాటులో పడకలు, మందులు

కరోనా తొలి వేవ్ నుంచి వైరస్ వ్యాప్తి తగ్గినప్పటికీ.. ఆస్పత్రుల్లో పడకలు, మందులు, ఆక్సిజన్ నిల్వలు, ఇతర చికిత్స వనరులను ప్రభుత్వం నిరంతరం అందుబాటులో ఉంచుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో 12,292 సాధారణ, 34,763 ఆక్సిజన్, 8,594 ఐసీయూ, 1,092 పీడియాట్రిక్ ఐసీయూ పడకలు అందుబాటులో ఉన్నాయి. 5,813 వెంటిలేటర్లు, 5,610 పీడియాట్రిక్ వెంటిలేటర్లు, 297 నియోనాటల్ వెంటిలేటర్లు, 3,902 డీటైప్ సిలిండర్లు, 15,565 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 170 పీఎస్ఏ ప్లాంట్‌లు ఉన్నాయి. వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయడానికి 2,64,109 ర్యాపిడ్ కిట్‌లు, 4,88,962 వీటీఎం-ఆర్టీపీసీఆర్ కిట్‌లు ఉన్నాయి. చికిత్సలో వాడే రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు 1.39 లక్షలు, ఇతర మందుల నిల్వలు సరిపడా ఉన్నాయి.

వందశాతం రెండుడోసుల వ్యాక్సినేషన్

రాష్ట్రంలో 18 ఏళ్లపైబడిన 3.95 కోట్ల మందికి కరోనా వ్యాక్సిన్ వేయాల్సిందిగా లక్ష్యం ఉంది. ఈ క్రమంలో లక్ష్యానికి మించి 4.35 కోట్ల మందికి ఇప్పటికే రెండుడోసుల వ్యాక్సినేషన్ పూర్తయింది. 12 నుంచి 17 ఏళ్ల పిల్లలందరికీ రెండుడోసుల వ్యాక్సిన్ వేశారు. 18–59 మధ్య వయసుగల 2.30 కోట్ల మందికి ప్రికాషన్ డోసు టీకాను వైద్యశాఖ వేసింది.

ఆందోళనకర పరిస్థితి లేదు



రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి పూర్తి నియంత్రణలో ఉంది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఒకవేళ కేసులు పెరిగినా సమర్థంగా నియంత్రించడానికి అన్ని వనరులు సిద్ధంగా ఉన్నాయి. ఫీవర్ సర్వేను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం 49వ రౌండ్ ఫీవర్ సర్వే చేపడుతున్నాం. అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి అవసరం మేరకు వైరస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైరస్ బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. సాధారణ ప్రజలు సైతం సమూహాల్లో ఉన్నప్పుడు మాస్క్ ధరించాలి.

– ఎం.టి.కృష్ణబాబు, ముఖ్యకార్యదర్శి వైద్య, ఆరోగ్యశాఖ

మంచిని పొగిడితే నొప్పెందుకు?

- సోషల్ మీడియా పోస్టులు చూసి వార్తలు రాస్తారా?
- అంత దిగజారిపోయిందా ఈనాడు దినపత్రిక
- సీటీ సర్జన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కర్నూలు (హాస్పిటల్): 'నేనేమైనా డ్యూటీ సమయంలో ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నానా? ఆస్పత్రికి వచ్చే నిధులను కొల్లగొడుతున్నానా? ఎవరినైనా తీవ్ర పదజాలంతో విమర్శిస్తున్నానా? ఒక ప్రభుత్వ అధికారిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఓ రెండు కవితలు రాశాను. ఇదే నేను చేసిన తప్పా. ఎక్కడైనా ఏ పత్రికలైనా ఇలాంటి విషయాలపైన కూడా వార్తలు రాస్తాయా.. విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగిస్తున్నామని చెప్పుకొనే ఈనాడు దినపత్రిక చేసేపని ఇదా.. ఇంతకంటే దౌర్భాగ్యమేమైనా ఉందా..' అని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ (సీటీ) సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈనాడు దినపత్రిక పనిగట్టుకుని తనపై ప్రతిరోజూ విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడైనా ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ సమాచారాన్ని బయటికి చెబితేనో, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితేనో, కార్యక్రమాలు చేపడితేనో సీసీఏ రూల్స్ ప్రకారం నేరమని చెప్పారు. ప్రభుత్వం మంచిచేస్తే దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయడం తప్పు అని ఆ పత్రిక ఎలా చెబుతుందని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఓ ఉద్యోగ సంఘం నాయకుడు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళనలు చేసి రాలేదా, టీడీపీకి మద్దతు ఇస్తూ కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదా, ఆయనపై అప్పుడు ఏమైనా వార్తలు రాశారా అని నిలదీశారు. తాను కేవలం ప్రభుత్వం చేసే మంచి గురించే కాకుండా సామాజిక, ఆరోగ్యం, మూఢనమ్మకాలు, ఇతర అంశాలపైన కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటానని చెప్పారు. తనకు సోషల్ మీడియాలో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారని, తన అభిప్రాయాలను వారితో పంచుకునే హక్కు తనకు ఉందని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి వస్తే ఒక్కోసారి రాత్రి 8 గంటల వరకు ఇక్కడే ఉండి పనిచేయాల్సి ఉంటుందన్నారు. తాను నిజాయితీనే నమ్ముకున్నానని, కష్టపడి పనిచేయడమే తెలుసని చెప్పారు. పదిమందికి సహాయం చేయటం తన నైజమని, దేశభక్తి, స్వామిభక్తి తన బలహీనత అని పేర్కొన్నారు. తానిలాగే ఉంటానని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి హత్య కేసును సీబీఐకి ఎలా బదలాయిస్తాం?

- సుబ్రహ్మణ్యం హత్య కేసులో సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇవ్వం
- తేల్చిచెప్పిన హైకోర్టు సీజే ధర్మాసనం
- కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశం..
- విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చే ప్రసక్తే లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. దర్యాప్తును సీబీఐకి బదలాయించాలన్న అప్పిలెంట్ల అభ్యర్థనను ఆక్షేపించింది. ప్రతి హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఎలా బదలాయిస్తామని ప్రశ్నించింది. అది ఎంత మాత్రం సాధ్యం కాదని స్పష్టంచేసింది. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే కోరుతూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఆ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే ఏం చేయాలో నిర్ణయిస్తామని తెలిపింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సుబ్రహ్మణ్యం హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరుతూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ గత ఏడాది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి కొట్టేశారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరించారు. మూడు నెలల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అప్పిలెంట్ల న్యాయవాది వెంకటేష్ వాదనలు వినిపిస్తూ.. నిందితుడు ఎమ్మెల్సీ అని, దీంతో పోలీసుల దర్యాప్తు ఏకపక్షంగా సాగుతోందని తెలిపారు. అందుకే దర్యాప్తును సీబీఐకి బదలాయించాలని, సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. సీబీఐకి దర్యాప్తు అప్పగించే విషయంలో కొన్ని విధివిధానాలున్నాయని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు కోరుతున్నందున దీనిపై పోలీసుల కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే ఏం చేయాలో నిర్ణయిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమయంలో వెంకటేష్ స్పందిస్తూ.. ఈ లోపు పోలీసులు చార్జిషీట్ దాఖలు చేస్తే తమ వ్యాజ్యం నిరర్థకం అవుతుందన్నారు. అలా ఎంత మాత్రం కాదని, తిరిగి దర్యాప్తునకు ఆదేశించే అధికారం తమకుందని ధర్మాసనం గుర్తు చేసింది.

పేదలందరూ బీమా పరిధిలోకి..!

- అతి తక్కువ ప్రీమియంతో జీవిత, ప్రమాద బీమా సదుపాయం
- ఉపాధి కూలీలు, పొదుపు మహిళలకు బీమా కల్పించాలని కేంద్రం లక్ష్యం
- వీధి విక్రయదారులు, పారిశుధ్య కార్మికులకు కూడా...
- జూన్ నెలాఖరు వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచారం
- తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం లేఖ

సాక్షి, అమరావతి: పేదలందరినీ బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద జీవిత, ప్రమాద బీమా సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. జూన్ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. బ్యాంక్ ఖాతా ఉన్నవారు ఏడాదికి రూ.330లు చెల్లిస్తే పీఎంజేజేబీవై కింద రూ.2లక్షలు జీవిత బీమా, ఏటా కేవలం రూ.12లు ప్రీమియం చెల్లిస్తే పీఎంఎస్‌బీవై కింద రూ.రెండు లక్షలు ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు, పొదుపు సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికులు, వీధివిక్రయదారులతోపాటు అంగన్‌వాడీ వర్కర్లు అందరినీ ఈ బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ జితేంద్ర అసతి రెండురోజుల కిందట అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాశారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని అర్హులందరూ బీమా ప్రీమియం చెల్లించేలా విస్తృత ప్రచారం నిర్వహించడంతోపాటు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి కేంద్ర ఆర్థికశాఖ అధికారులు వివిధ రాష్ట్రాల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. కాగా, మన రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండగా.. ఉపాధి హామీ పథకంలోనూ 93.81 లక్షల మంది క్రియాశీలక కూలీలుగా కొనసాగుతున్నారు.



'పూలే ఆశయాలను అమలుచేస్తున్న ప్రభుత్వం'

సాక్షి, అమరావతి: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన అలుపెరగని కృషిని ఆదర్శంగా తీసుకుని రైతులకు ఉచితంగా, పేదలకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయడం ద్వారా ఆ మహనీయుని ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఏపీ జెన్కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ చక్రధర్‌బాబు అన్నారు. విద్యుత్ సౌధలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటం వద్ద చక్రధర్‌బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. చక్రధర్‌బాబు మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అణగారినవర్గాల సంక్షేమం కోసం విద్యుత్ రంగంలోనూ నవరత్నాలను అమలు చేస్తోందని తెలిపారు.

స్థానిక వార్తలు

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన

- ప్రతిపక్షాలకు 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా
- మంత్రి ఆదిమూలపు సురేష్



కొత్తూరు ప్రభపై నుంచి మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగుతుందని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఆషాకాలేషా మస్తానయ్య ఉరుసు కార్యక్రమంలో భాగంగా రాత్రి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్రభపై నుంచి మంత్రి సురేష్ మాట్లాడారు. రాష్ట్రంలో సుస్థిర పాలన ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని అన్నారు. గత పాలనలో బడుగు, బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు నవరత్నాల పథకాల ద్వారా నూరు శాతం అమలు చేశారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనే విధంగా సంక్షేమ పథకాలను అందచేస్తూ జనరంజకపాలన సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు అన్నీ కూడా 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము ఉందా అని మంత్రి సురేష్ ప్రశ్నించారు. ఎవరితో పొత్తు లేకుండా అన్ని స్థానాల్లో పోటీ చేసే పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ కే ఉందని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఒక పార్టీ నాయకుడు రాష్ట్రంలో రెండు చోట్ల పోటీ చేశాడు కానీ ఒక్క స్థానంలో కూడా గెలవలేదు, ఆయన జగనన్న విమర్శిస్తాడు, ఇదే విషయం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు గ్రామాల్లో నీళ్లు లేవని ఒకటే పోరుచేస్తున్నారని, టీడీపీ వారు తాగు నీరు ఎక్కడ అవసరమో చెపితే అక్కడ తన సొంత ఖర్చుతో బోర్లు వేయిస్తానని అన్నారు. పశ్చిమ ప్రకాశం మణిహారం టి5 కాలువ పనులకు రూ.83 కోట్ల నిధులు మంజూరు చేశారని, నెలలోపు టెండర్లు పిలిచి పనులు చేస్తారని అన్నారు. దీని ద్వారా నియోజకవర్గ పరిధిలో సుమారు 45 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. అనంతరం కార్యకర్తలు మంత్రి సురేష్ ను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పుల్లలచెరువు, వైపాలెం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు రెంటపల్లి సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, సర్పంచ్‌లు కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు గాలి రెడ్డి, కృష్ణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు జానికి రఘు, రవణయ్య తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన సభా వేదిక



మార్కాపురంలో ఏర్పాటు చేసిన సీఎం జగన్ భారీ కటౌట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

సీఎం రాక కోసం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు బుధవారం మార్కాపురం రానున్నారు. ఈ సందర్భంగా అధికారులు, పార్టీ నాయకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో భారీగా సీఎం కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

– మార్కాపురం



సీఎం కాన్వాయ్ ట్రైల్ రన్



సిద్ధమైన హెలిప్యాడ్

పూలే అడుగుజాడల్లో జగనన్న

- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుస్తున్నారని, ఈ మేరకు బీసీ వర్గాలకు ఆయన పెద్దపీట వేయడంతోపాటు రాష్ట్ర క్యాబినేట్‌లో ప్రముఖ స్థానం కల్పించారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి మంత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆలోచన మార్గాన్ని జగనన్న అందిపుచ్చుకొని రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారని, ఈ మేరకు అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి బాలిక బడికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సమాజానికి వెన్నముక కులాలని చెప్పి బీసీ కులాల అభ్యున్నతికి 50కిపైగా ఉన్న ఉపకులాలను ఏకంచేసి వారికి అనేక పథకాలను అమలు పరుస్తున్నారని, కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా నిధులు కేటాయించారని చెప్పారు. సామాజిక న్యాయం అనిచెప్పి గత టీడీపీ ప్రభుత్వం మాటలకే పరిమితం చేసిందని, బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అభివృద్ధి చెందటానికి ఎటువంటి కృషి చేయలేదని విమర్శించారు. మీ తోకలు కట్ చేస్తామనిచెప్పి వారిని కించపరిచేలా, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా చంద్రబాబునాయుడు నాయిబ్రాహ్మణులను ఉద్దేశించి మాట్లాడిన మాటలు మరచిపోలేకపోతున్నామని అన్నారు. ఈ రోజు అటువంటి పరిస్థితి లేకుండా జగనన్న అన్ని కులాల వారికి ఉపయోగపడేలా పథకాలను అమలు పరుస్తున్నారని చెప్పారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో, మహాత్మా జ్యోతిరావుపూలే ఆలోచన విధానంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాస రెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బాలగురవయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఐ.వి.సుబ్బారావు, కందూరి కాశీనాథ్, ఎం.సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం చీరాల మండలంలోని తోటవారిపాలెం-2 సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ అన్నీ సామాజిక వర్గాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ జగన్నను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఏపీఎం సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బి.కేశవులు, బి.జ్వాలా, ఎన్.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ప్రసాద్, మురళి, వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి తరానికి పూలే ఆదర్శనీయుడు

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: దేశంలో మొట్టమొదటిగా మహాత్మ అని పిలవబడిన జ్యోతిబా పూలే నేటి తరనికి ఆదర్శనీయుడని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. జ్యోతిబా పూలే జయంతి మంగళవారం పట్టణంలోని బీసీ భవన్‌లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూలే చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. వెనుకబడిన కులాల ప్రజలకు సమాన హక్కులు పొందేందుకు సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైఎస్సార్ సీపీ నేత చెంచిరెడ్డి, నాయకులు రంగస్వామి గౌడ్, ఎస్. అచ్చయ్య, చిన్న వేంకటేశ్వర్లు, పాలయ్య, నాగార్జున, చక్రపాణి పాల్గొన్నారు. బీసీ సంఘంలోని ఐదుగురు ప్రముఖులైన పినికి నాగేశ్వరరావు, పాలెం చెంచయ్య, డాక్టర్ శ్రీనివాసగౌడ్, మల్లా వెంకటసుబ్బయ్య, చిత్తారి రంగనాయకులు.. ఎమ్మెల్యేను సన్మానించి బీసీ సంఘం ప్రశంసపత్రాన్ని అందజేశారు.

వీహెచ్ఆర్ కాలేజీలో..

జ్యోతిబాపూలే మహనీయుడని ఇందిర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఏపీ పాల్యూషన్ బోర్డు సభ్యుడు, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, ప్రొఫెసర్‌లు రాజశేఖరరెడ్డి, సాయిబాబా, సత్యవాణి, రవీంద్ర పాల్గొన్నారు.



పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ఘనంగా పూలే జయంతి

దర్శి: మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే 196 జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంప్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీపీ సుధాఅచ్చయ్య, సర్పంచ్‌లు విజయ్, అంకాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. పోతవరం ఎంపీపీఎస్‌లో పూలే జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు బసంతి, ఖాసీం, కల్పన, వీరాంజనేయులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని.. బీసీ నాయకుడు కంచర్ల కోటయ్యగౌడ్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వీరితో పాటు బీజేపీ నాయకులు రామాంజనేయులు, చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ శ్రమించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బీసీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: అవిభక్త భారతదేశంలో అంటరాని తనం, అణచివేత, సామాజిక రుగ్మతలపై పోరు సల్పిన తొలినాటి యోధుడు శ్రీ జ్యోతిరావు పూలే అని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, సర్పంచిలు మేకల చార్లేస్ సర్జన్, వలి, ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావు, ఎంఈఓ జి.సుబ్బయ్యలు నివాళులర్పించారు.



దర్శి: పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూముల రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని డిప్యూటీ తహసీల్దార్ టి.రవికాంత్ అన్నారు. మండలంలోని జమ్మలమడకలో భూ రీసర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతులంతా అందుబాటులో ఉండి భూహక్కులకు సంబంధించిన పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్, పాస్ ఫొటోలు అందించాలని చెప్పారు.

శంకరాపురంలో సర్వే పూర్తయిందని, చిన ఉల్లగల్లు, బసవాపురం, జమ్మలమడక గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని చెప్పారు. రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సర్పంచి వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి మొలకయ్య, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.





పబ్లిక్ నోటీస్

నా కక్షిదారుడైన కంబాలపల్లి రామచంద్రారెడ్డి తండ్రి వెంకట సుబ్బయ్య, వృత్తి టీచర్, నివాసం ఫ్లాట్ నెం. 606, గణేష్ నగర్, సి.క్యాంప్, కర్నూలు గారి నుండి సరియైన సూచనలు పొంది తెలియజేయు పబ్లిక్ నోటీసు ఏమనగా!

దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తి నా కక్షిదారునికి మరియు అతని అన్నదమ్ములకు పిత్రార్జితపు ఆస్తియై ఉన్నది. నా కక్షిదారునికి 1/4వ వంతు వారసత్వపు హక్కుగా సంక్రమించిన అవిభాజ్యపు హక్కు కలిగియున్నాడు. కానీ, నా కక్షిదారునికి తెలియకుండా అతని 1/4 వ వంతు వాటాను అతని అన్నదమ్ములు రెవెన్యూ రికార్డు నందు నమోదు చేసుకొనుటకు ప్రయత్నం చేసి, తదుపరి ఇతరులకు అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది.

కావున ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా, అట్లు ఎవరైనా నా కక్షిదారుని ప్రమేయం లేకుండా అమ్మకాలు కొనుగోలు చేసిన యెడల, సదరు ఆస్తిపై ఎటువంటి హక్కులు కలుగవని, అటువంటి దస్తావేజులు చెల్లనేరవనియూ మరియు మా కక్షిదారుడు తీసుకొనబోవు క్రిమినల్ మరియు సివిల్ చర్యలకు బాధ్యులు అగుదురని తెలియజేయడమైనది.

SCHEDULE

Properties are situated in Prakasham District, Markapur Sub - Registration District and within the village limits of Ayinamukkala of Pedda Domala Mandal, and the details are furnished as hereunder :

1. Sy.No. 93,	Ex: Ac 0-80 Cents,	11. Sy.No. 5/2	Ex: Ac 2-20 Cents
2. Sy.No. 135/1,	Ex: Ac 2-15 Cents	12. Sy.No. 113-1B	Ex: Ac 0-56 Cents
3. Sy.No. 25,	Ex: Ac 1-30 Cents	13. Sy.No. 114/2	Ex: Ac 0-31 Cents
4. Sy.No. 37,	Ex: Ac 1-23 Cents	14. Sy.No. 121/4	Ex: Ac 0-25 Cents
5.	Ex: Ac 1-25 Cents (Ganga Chenu)	15. Sy.No. 92/A	Ex: Ac 0-66 Cents
		16. Sy.No. 93	Ex: Ac 0-78 Cents
6. Sy.No. 113,	Ex: Ac 1-12 Cents	17. Sy.No. 94	Ex: Ac 1-45 Cents
7. Sy.No.92/A	Ex: Ac 1-16 Cents	18.	Ex: Ac 1-25 Cents
8. Sy.No. 113	Ex: Ac 0-86 Cents	19. Sy.No. 135/1	Ex: Ac 2-68 Cents
9. Sy.No.93	Ex: Ac 0-8- Cents	20. Sy.No. 135/2	Ex: Ac 0-61 Cents
10. Sy.No. 94	Ex: Ac 1-00 Cents	21. Sy.No. 37	Ex: Ac 1-22 Cents
			Total Extent : Ac 23-85 Cents

తాతిరెడ్డి రామగోపాలరెడ్డి, అడ్వకేటు, నంద్యాల.
సెల్: 94402 12642

నేడు గడప గడపకు
మన ప్రభుత్వం

కొమరోలు: మండలంలోని అల్లినగరం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అల్లినగరం, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటన సాగుతుందని తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

14న మెగా రక్తదానం

మార్కాపురం టౌన్: పట్టణంలో ఈ నెల 14న అరుణచలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తునట్లు వైద్యశాల చైర్మన్ డాక్టర్ పడగాల లక్ష్మీరెడ్డి విలేకరులకు తెలిపారు. శిబిరంలో రక్తం ఇచ్చే దాతలకు సంవత్సరం పాటు తమ ప్రజా వైద్యశాలలో ఉచిత ఓపీ సదుపాయం కల్పిస్తునట్లు పేర్కొన్నారు.









స్వాగతం సుస్వాగతం
ప్రతి అక్కచెల్లెమ్మలకు అన్నగా, తోబుట్టువుగా,
పిల్లలకు మేనమామగా రాష్ట్రప్రజలందరికి బంధువై
మహిళల పక్షపాతిగా ఎన్నో కార్యక్రమాలు
చేపట్టిన మన గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు
మహిళల కోసం
వై.యస్.ఆర్ ఈబీసీ నేస్తం
కార్యక్రమాన్ని ప్రారంభించుటకు మార్కాపురం
వస్తున్న సందర్భంగా మా హార్థిక
స్వాగత సుమాంజలులు..
శ్రీ డా॥ ఆదిమూలపు సురేష్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రివర్యులు
ఆర్. సుశీల పిచ్చయ్య యాదవ్
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్
త్రిపురాంతకం
ఉడుముల శ్రీనివాసరెడ్డి
AMC చైర్మన్, యర్రగొండపాలెం
గంటా రమణారెడ్డి
మండల YSRCP కన్వీనర్
పెద్దదోర్నాల
పాలిరెడ్డి కృష్ణారెడ్డి
మండల YSRCP కన్వీనర్
పెద్దారవీడు
కె.సి.హెచ్. ఒబుల్‌రెడ్డి
మండల YSRCP కన్వీనర్
యర్రగొండపాలెం
సింగారెడ్డి పోలిరెడ్డి
మండల YSRCP కన్వీనర్
త్రిపురాంతకం
B.V. సుబ్బారెడ్డి
మండల YSRCP కన్వీనర్
పుల్లలచెరువు
యేర్వ చలమారెడ్డి
ZPTC పెద్దారవీడు
మాకం జాన్‌పాల్
ZPTC త్రిపురాంతకం
చేదూరి విజయభాస్కర్
ZPTC యర్రగొండపాలెం
రమావత్ వాగ్యానాయక్
ZPTC పుల్లలచెరువు
లకా చంద్రకాంత్ నాయక్
ZPTC పెద్దదోర్నాల
కోట్ల సుబ్బారెడ్డి
MPP, త్రిపురాంతకం
దొంత కిరణ్‌గౌడ్
MPP, యర్రగొండపాలెం
మందా లాజర్
MPP, పుల్లలచెరువు
బేజవాడ గురవయ్య
MPP, పెద్దారవీడు
గుమ్మా పద్మజ మల్లేష్
MPP, పెద్దాదోర్నాల
సయ్యద్ షాకీర్
జిల్లా పరిషత్ కో ఆప్షన్ మెంబర్
యర్రగొండపాలెం
వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ
యర్రగొండపాలెం నియోజకవర్గం

క్లుప్తంగా

హైకోర్టు జడ్జి పరామర్శ


శారదాదేవిని పరామర్శిస్తున్న హైకోర్టు జడ్జి రామకృష్ణప్రసాద్

కారంచేడు: సినీ నిర్మాత, మూవీ మొఘల్, మాజీ ఎంపీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు తమ్ముడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామ్మోహన రావు((మోహన్‌బాబు) ఈ నెల 4వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. మోహన్ బాబు కుటుంబానికి సన్నిహితులు, బంధువు అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం సాయంత్రం కారంచేడు వచ్చారు. మోహన్ బాబు సతీమణి శారదాదేవిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

కామన్‌వెల్త్ ప్రిలిమినరీ పోటీలకు ప్రేమ్‌సాగర్


దేవరకొండ ప్రేమసాగర్

చీరాల రూరల్: కామన్‌వెల్త్ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు జూలై 11 నుంచి 16 వరకు ఢిల్లీలో జరుగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఆహ్వానం అందినట్లు ఉమ్మడి జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, విశ్రాంత డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. మే 10వ తేదీలోగా ప్రేమ్‌సాగర్ పాటియాల చేరుకోవాలని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రేమ్‌సాగర్ అనేక పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. ప్రస్తుతం 73 కేజీల విభాగంలో మన బాపట్ల జిల్లా నుంచి ఏపీ తరఫున ప్రేమసాగర్ ఒక్కడే ఎంపిక కావడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి దేశానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడా ప్రేమికులు కోరుతున్నారు.

పెండింగ్ రుణాలు చెల్లించాలి

● డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు


మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

బల్లికురవ: ప్రభుత్వం పొదుపు గ్రూపుల బలోపేతానికి మహిళల జీవనోపాధుల పెంపుదలకు అందిస్తున్న స్త్రీనిధి, శ్రీఏఎఫ్, ఉన్నతి, బ్యాంకు లింకేజి రుణాలు సకాలంలో చెల్లించాలని జిల్లా డీఆర్ డీఏ పీడీ డాక్టర్ బీ. అర్జున్‌రావు కోరారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో సమీక్ష నిర్వహించారు. 2022–23 సవత్సరానికి స్త్రీనిధి, సీఏఎఫ్ ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.52 కోట్ల వరకు దజేసినట్లు చెప్పారు. సూరేపల్లి, పెద అంబడిపూడి, కొప్పరపాడు, గ్రామైక్య సంఘాల దాదాపు రూ.22 లక్షలు రుణాలు చెల్లించకపోవటంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. 2023–24 సంవత్సరానికి రుణ లక్ష్యాలను పెంచనున్నట్లు పీడీ ప్రకటించారు. సమీక్షలో ఏపీఎం బీ. సురేంద్రబాబు, స్త్రీనిధి మేనేజర్ శంకర్, సీసీలు పాల్గొన్నారు.

పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బాలిక బలవన్మరణం

మార్టూరు: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తాను ముందురోజు రాసిన పరీక్ష ఫెయిల్ అవుతానన్న అనుమానంతో బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని డేగరమూడి గ్రామంలో మంగళవారం జరిగింది. సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముక్తిపాటి అంకమ్మరావు, పుణ్యవతి దంపతులు కుమార్తె నాగపూజిత (15) ప్రస్తుతం మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనుల మీద బయటకు వెళ్లగా నాగపూజిత తమ ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సుమారు 11 గంటల సమయంలో నాగపూజిత అమ్మమ్మ, తాతయ్యలు ఇంటిలో ఫ్యానుకు వేలాడుతున్న మనుమరాలిని గమనించి, స్థానికులు సహాయంతో కిందకు దించి 108 వాహనం ద్వారా మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. సీఐ ఫిరోజ్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి నాలుగు పరీక్షలు రాసి మరో రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న నాగపూజిత తెలివైన, చిరుకైన విద్యార్థిని అని, అయితే ముందు రోజు రాసిన లెక్కలు పరీక్షలో మార్కులు తగ్గుతాయనే అనుమానంతో ఆందోళనకు గురై ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఈ దారుణానికి పాల్పడినట్లు తండ్రి అంకమ్మరావు పోలీసులు ఎదుట వాపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూలే జీవితం ఆదర్శం

● ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు: 'పూలే జీవితం ఆదర్శమని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని' జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఎస్.లక్ష్మానాయక్, డీఆర్‌ఓ శ్రీలత తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే పడిన తపన, కృషి నేడు సమాజంలో ఉన్నతంగా రాణించేందుకు అవసరమైన ఫలాలను అందిస్తున్నాయన్నారు. అటువంటి పూలే పేరు మీదుగా ఒంగోలులో ఒక భవన్ ఉండాలని బీసీ సామాజిక వర్గాలు చేసిన విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే స్థలం కేటాయించేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు బీసీలకే కేటాయించిన విషయాన్ని గమనించాలన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించిన పూలే ఆనాడు నెలకొన్న సామాజిక పరిస్థితుల్లో ఎంతో దారుణమైన వివక్షను చవిచూశారన్నారు. అటువంటి వివక్షను సమాజం నుంచి తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పూలే చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కటారి శంకర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు బంకా చిరంజీవి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, బీసీ, ఎస్సీ సంఘాల నేతలు, పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే

ఒంగోలు టౌన్: సంఘ సంస్కర్త, ప్రజా ఉద్యమకారుడు, అంటరానితనం లాంటి దురాచారాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన జ్యోతిరావు పూలే చూపిన బాటలో పయనిద్దామని ఎస్పీ మలికాగర్గ్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుల వ్యవస్థకు నిర్మూలన కోసం, బాలబాలికలు, బడుగు బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం పూలే దంపతులు జీవితాలను త్యాగం చేసిన తీరును కొనియాడారు. బాల బాలికలు, మహిళల విద్య కోసం చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆ మహనీయుని ఆదర్శాలను పాటిస్తూ ముందుకు సాగాలని కోరారు. ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీఓ ఏఓ సులోచన, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికాగర్గ్


వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

పూలే బాటలో పయనిద్దాం

● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అంకితమవుదామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. సమాజంలో నెలకొన్న వివక్షను రూపుమాపేందుకు విద్య అనే ఆయుధాన్ని చేపట్టారన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు భార్యను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా దేశానికి పరిచయం చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే తరహాలో విద్యా రంగాన్ని ప్రోత్సహించేలా అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుని అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే అనేక సామాజిక వర్గాలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తూ నామినేటెడ్ పదవులు కేటాయించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళల పట్ల సమాజంలో నాడు నెలకొన్న వివక్షను రూపుమాపేందుకు పూలే కృషి చేశారని, నేడు అదే బాటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం సంతోషంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని భావించి నేడు మహిళలకు సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, యువజన విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, టైలర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీబీ, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, ఒడా చైర్మన్‌సింగరాజు మీనాకుమారి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, గోనుగుంట రజని, తిర్లిక శ్రీనివాసులు, దాసరి కరుణాకర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షురాలు బైరెడ్డి అరుణ, పల్లా అనూరాధ, కావూరి సుశీల తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు: పదో తరగతి పరీక్షల్లో సైన్స్ పరీక్ష రాసే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సైన్స్ పరీక్షలో ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ రెండు ఒకే పేపర్‌లో ఉంటాయన్నారు. పార్ట్–ఏలో ఫిజిక్స్ ప్రశ్నలు 1 నుంచి 16 వరకు, పార్ట్ బీలో బయోలాజికల్ సైన్స్ ప్రశ్నలు 17 నుంచి 33 వరకు ఉంటాయన్నారు. జవాబులు రాసేందుకు ఓఎంఆర్‌లు రెండు ఇస్తామని, ఒక్కోటి 12 పేజీలు ఉంటుందన్నారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్ కోడ్‌పై సైన్స్ పి–1 అని, బయోలాజికల్ సైన్స్ ఓఎంఆర్‌పై పేపర్ కోడ్ –20, సైన్స్ పి–2 అని ఉంటుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టు సమాధానాలను ఆ సబ్జెక్టుకు సంబంధించిన బుక్‌లెట్‌లోనే రాయాలన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాలన్నారు. ఇన్విజిలేటర్లు కూడా విద్యార్థులు ఈ విషయమై పరీక్ష గదిలో పరీక్ష ప్రారంభానికి ముందు అవగాహన కల్పించాలన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి


రాజశ్యామల యాగంలో పూజలు నిర్వహిస్తున్న బాలినేని దంపతులు

● ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ రాజశ్యామల యాగం చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో వేదపండితుల సమక్షంలో రాజ శ్యామల యాగాన్ని మంగళవారం ప్రారంభించారు. వేద పండితుడు మఠంపల్లి దక్షిణమూర్తి నేతృత్వంలో యాగ క్రతువులు ప్రారంభించారు. ఉదయం బాలినేని స్వగృహంలో బాలినేని దంపతులచే కృతికా స్నానం చేయించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యాగ శాల వద్ద మండపారాధన నిర్వహించారు. రాజ శ్యామలాదేవి సహిత మహా మండపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని దంపతులకు దీక్షా కంకణాధారణ చేశారు. పండితుల సమక్షంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. గణపతి హోమం అనంతరం మండప పూజ, చతుర్వేద పారాయణం, మహాదీపారాధన, మంత్ర పుష్పం నిర్వహించి రాజ శ్యామలాదేవికి దర్బారు సేవను వేదోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.


యాగంలో పూజలు చేస్తున్న బాలినేని దంపతులు

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు


మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం పర్యటన సందర్భంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. పట్టణంలోని సౌజన్య కల్యాణ మండపంలో పోలీస్ అధికారులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు ముగ్గురు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, ఆర్ఐలు, 111 మంది ఎస్సైలు, 285 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 489 కానిస్టేబుళ్లు, 127 మంది మహిళా కానిస్టేబుళ్లు, 392 మంది హోంగార్డులు, ఆర్ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది మొత్తం 1700 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక ప్రాంతం వరకు ఉన్న పాయింట్లలో ఉండే అధికారులు అనుక్షణం జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైన చోట బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. సీఎం పర్యటనలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ బందోబస్తులో ఉండే అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు సవ్యంగా జరిగేలా చూడాలని, బయట నుంచి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురాన తదితరులు పాల్గొన్నారు.

విధి విధానాలతో పనిచేస్తే గెలుపు ఖాయం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: విధి విధానాలతో కలిసి మెలసి పనిచేస్తే గెలుపు ఖాయమని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని విశా సుబ్బరత్నం కల్యాణ మండపంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్.. అనే కార్యక్రమంపై మండలంలోని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించడంలో మీ బాధ్యత గుర్తెరిగి ప్రవర్తించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధించారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళ్తుంటే టీడీపీ మాత్రం దుష్ప్రచారం చేస్తోందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో పార్టీ, నాయకుల్లో నుంచి వచ్చింది కాదని, అది ప్రజల గుండెల్లో నుంచి వచ్చిన కార్యక్రమమన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుక్షణం ప్రయత్నిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శ్రీనయ్య, గిద్దలూరు జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు, సచివాలయం కన్వీనరు ఈశ్వర్‌నాయుడు, మండల కన్వీనర్ ఓబులపతి, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, పగడాల వెంకటేశ్వర్లు, ముద్దర్ల శ్రీను పాల్గొన్నారు.

తాళ్లూరు: పేదల సంక్షేమమే జగనన్న ఆశయమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపురం, తాళ్లూరు, మాధవరం గ్రామాల్లో మంగళవారం జగనన్న మా నమ్మకం నువ్వే కార్యక్రమం వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వలి, మేకల చార్లేస్ సర్జన్, తాటికొండ నాగలక్ష్మిలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమాన్ని వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలు అడిగి పూరించారు. ప్రజల అనుమతితో గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. ఆయా కార్యక్రమాల్లో కోఆప్షన్ మెంబర్ కరిముల్లా, ఎంపీటీసీ మెడగం వెంకట రామిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పులి వికాస్, నుసుం చిన ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు

దర్శి: జగనన్నే మా భవిష్యత్.. నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మంగళవారం మండలంలోని గ్రామాల్లో సచివాలయాల మండల అధ్యక్షుడు బత్తినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్‌లు అంటించి ప్రభుత్వ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయ్, రాము పాల్గొన్నారు.

కొమరోలు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తుందని, ప్రజలు ఆ పార్టీకే పట్టం కడతారని గిద్దలూరు నియోజకవర్గ నాయకులు కామూరి రమణరెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిచెర్ల, సూరవారిపల్లి, బాదినేనిపల్లి గ్రామ పంచాయతీల్లో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎంపీపీ కామూరి అమూల్య, గ్రామ సర్పంచ్‌లు ప్రతి గడపకు వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. రెడ్డిచెర్ల, సూరవారిపల్లి గ్రామ సర్పంచ్‌లు ఉమాదేవి, కాశమ్మ పాల్గొన్నారు. మండలంలోని మొట్టుపల్లె గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ రాజేంద్రప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ నాయకులు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణరెడ్డి.. వలంటీర్ రాజేంద్రప్రసాద్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25 వేల నగదు అందజేశారు.

కంభం: జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటి కార్యక్రమం చేపట్టారు. గృహ సారథులతో కలిసి సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరిగి రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. సర్పంచ్ పల్నాటి బోడయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, జేసీఎస్ మండల కన్వీనర్ డిష్ మున్నా, ఎంపీటీసీ రఫీ, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నాయకులు గంగారపు కృష్ణ, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం): గడిచిన నాలుగేళ్ల పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతుండటంతో మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదం అందరినోట వినిపిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ అన్నారు. మంగళవారం మా నమ్మకం నువ్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగులవరం, బొల్లుపల్లి గ్రామంలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటా తిరిగి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీసి స్టిక్కర్లు అంటించారు. జేసీఎస్ మండల కన్వీనర్ యేరువ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్లు పాల్గొన్నారు.

దొనకొండ: జగనన్నే మా నమ్మకం, మా భవిష్యత్తు అంటూ స్థానిక ఉప సర్పంచ్ పి.ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో దొనకొండలో ఇంటింటికీ తిరిగి మంగళవారం ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుని సంక్షేమం వివరించారు. జగనన్నే మా నమ్మకం, మా భవిష్యత్తు అంటూ స్టిక్కర్లను గోడలకు అంటించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు సయ్యద్ ముజాయిద్, రహమత్ బేగ్ పాల్గొన్నారు.